పోటీ

— సిహెచ్.శ్రీనివాస్

'టాక్!'

పోస్ట్‌మాన్ పిలుపుతో వాలుకుర్చీలో కూర్చుని కునుకు తీస్తున్న శ్రీరాములు తెలివెళ్లి కవరు అందుకున్నాడు.

''ఎక్కడినుంచండీ'' ఉత్తరం వంటింట్లోనుండి చేతులు తుడుచుకుంటూ వస్తూ అడిగింది అతని భార్య లక్ష్మీదేవి.

''అబ్బబ్బ నీకు అన్నింటికీ తొందరే, కాస్త ఆగరాదూ'' అంటూ కసరుచించి చదివాడు శ్రీరాములు. లక్ష్మి ఆత్రుతగా చూస్తుండిపోయింది.

''ఏమే చూశావా లక్ష్మి మొన్న మా నాన్నగారు పోయాక మా ఊళ్లోని పాతిల్లు, ఆ కాస్త పొలం అమ్మాలని మా అన్నయ్య నిర్ణయించాడట. ప్రస్తుతం వాటికి సుమారు పలభైవేలదాకా పలకవచ్చని అనుకుంటున్నాడట. అయితే అందులో మన వాటాక్రింద వచ్చే ఇరవైవేల రూపాయలను అమ్మకాలు అవీ పూర్తికాగానే ఈ వారంరోజుల్లో పంపిస్తానని మా అన్నయ్య కృష్ణమూర్తి రాసాడే'' అని ఆనందంతో చెప్పాడు శ్రీరాములు.

ఉత్తరం అందుకున్నప్పటినుంచి వాళ్ల మనసు మనసులో లేదు. డబ్బు ఎంత తొందరగా వస్తుందా ఎలా ఖర్చు పెట్టాలా అని ఎవరికి వారే ప్రణాళికలు సిద్ధం చేసుకోసాగారు. అయితే ప్రస్తుతానికి శ్రీరాములుకు తనకొచ్చే జీతంతో సంసారం బాగానే నడుస్తున్నది. ఈ అప్పనంగా వచ్చే డబ్బు గురించి శ్రీరాములు తలలో పాతుకుపోయిన సమస్యకు ఇరుగుపొరుగువారు పరోక్షంగా పరిష్కారం చూపకపోలేదు. ముఖ్యంగా శ్రీరాములు పక్కింట్లో ఉండే పోకిల్లా రాయుడు విజయకృష్ణ, అతని బూడిదరంగు స్కూటరు. అతను నోట్లో కింగ్‌సైజ్ సిగరెట్‌పెట్టి, కళ్లకు రేబాన్ గ్లాసులు ధరించి నీట్‌గా టక్ చేసుకుని భార్యను తీసుకొని ప్రతిరోజూ సాయంత్రం షికార్లకు వెళుతున్నప్పుడల్లా శ్రీరాములు ఎంతో బాధపడిపోయేవాడు. ఉత్తరం అందుకున్నప్పటినుంచి ఈ బాధను అతనింక భరించలేకపోతున్నాడు. తనకు మాత్రం వచ్చిన లోటేమిటి? ఉద్యోగంలో రాబడి, సంఘంలో పలుకుబడి అతడికంటే ఎక్కువే, పైగా తనకి ఇరవైవేల రూపాయలు ఏ క్షణమయినా రావచ్చు. ఇహపోతే శ్రీరాములు భార్య లక్ష్మీదేవిగారు భర్తకు ఏ విషయంలోనూ తీసిపోరు. ఆమె సమస్యలు ఆమెకున్నాయి. 'ఎంత చెట్టుకు అంత గాలి' అంటారే అలాగన్నమాట. అయితే వాటిని పక్కింటి ఉమారాణి కొంత పరిష్కరించింది. ఎలాగంటారా? ఈ మధ్య ఆవిడగారు మెడనిండా అమ్మోరులా బంగారునగలు వేసుకోవడమేగాక, ప్రతి పండక్కీ, పబ్బానికీ ఓ కొత్తచీర కొంటూనే ఉంది. అసలే తెల్లటి తెలుపుతో మల్లెతీగలా ఉంటే ఆవిడకు ఈ నగలు, చీరలు మరింత అందాన్నియడంతో వీధివాళ్ల కళ్లన్నీ ఆవిడమీదే ఉంటున్నాయి. అమ్మలక్కలందరూ ఏ పేరంటంలో కల్సినా, వీధి కుళాయివద్ద కలిసినా ఆవిడ గురించి మాట్లాడుకోసాగారు. ఇదంతా చూస్తుంటే లక్ష్మీదేవి మనసు అసూయతో రగిలిపోతూవుంది. అన్ని నగలు, అంత మంచి ఖరీదైన చీరలు తనకే గనుక ఉంటే ఈ వీధిలోని కళ్లన్నీ తనమీదే ఉండి ఉండేవి. పైగా తన భర్త ఉద్యోగం, ఉమారాణి భర్తకంటే పెద్దదే, అతను నాల్గు చేతులా సంపాదించవచ్చు. అది ఎవడిక్కావాలి? పోనీ, అంతస్తు ఉద్యోగాన్నిబట్టి వస్తుంది కదా! కాబట్టి తన ఆధిక్యతను వచ్చే డబ్బుతో ఏ విధంగానైనా ప్రదర్శించాలని లక్ష్మీదేవి గట్టిగా నిర్ణయించుకుంది. అవసరమయితే ఈ విషయంలో భర్త శ్రీరాములుగారితో యుద్ధం ప్రకటించదలచుకుంది.

అయితే ఇద్దరికీ తెలుసు తమ భాగస్వాములు ఒకసారి చెప్పగానే అంత తేలిగ్గా ఒప్పుకోని రకమని. అందుకే ఇద్దరూ మనసుని ప్రశాంతంగా చేసుకున్నారు. సుహృద్భావ వాతావరణంలో శాంతి యుతంగా, సామరస్యంగా వాళ్ల కోరికల్ని తీర్చుకోవాలనేది వారి ఆశ.

ఆ రోజు శ్రీరాములు అలవాటుకంటే కాస్తముందుగానే ఇంటికి బయలుదేరాడు. లక్ష్మికోసం బుట్టెడు మల్లెపూలు కొన్నాడు. ఆమెకిష్టమైన పుల్లారెడ్డి మిఠాయిలు తీసుకొన్నాడు. మనసు హాయిగా పంచకళ్యాణి గుర్రంలా గంతులేస్తుండగా హుషారుగా ఇంటికొచ్చాడు. ఇక్కడ లక్ష్మి భర్తకోసం వళ్లంతా కళ్ళు చేసుకుని అభిసారికయై ముద్దలా గుమ్మంలో నిల్చుని ఎదురుచూస్తుంది. అతనికిష్టమయిన జీడిపప్పు ఉప్మా, ఉల్లిపాయ పకోడీలు, చేసింది.

భార్య ఆదరాభిమానాలకు ఆశ్చర్యపోయాడు, ఉక్కిరిబిక్కిరైనాడు. లక్ష్మికి తనకోరిక చెప్పాలనుకున్నాడు. అవకాశం కోసం ఎదురుచూస్తూ తృప్తితీరగా మనసులో నవ్వుకున్నాడు. అయితే లక్ష్మీదేవి ఏమయినా తక్కువ తిందా! ఆవిడ భర్త వాలకం ఓరకంట గమనిస్తూనే వుంది.

చివరికి రాత్రి పదిగంటలయ్యింది. పిల్లలంతా ఆడి, తిని నిద్రపోయారు. పిల్లలందరినీ వాళ్ల గదుల్లో పడుకోబెట్టివచ్చింది లక్ష్మి. తర్వాత శ్రీరాములు, లక్ష్మిలు మెహమొహాలు చూసుకున్నారు. చిలిపిగా నవ్వుకున్నారు. ఉత్సాహంగా పడకగదిలోకి వెళ్లారు. తీయని తలుపులు మదిలో నిండగా తలుపులు మూసుకున్నారు. సంభాషణ ఎలా మొదలుపెట్టాలా, ఎవరు మొదలుపెట్టాలా అన్న మీమాంసలో ఇద్దరూ ఉండిపోయారు. ఎలాగయితేనేం శ్రీరాములు మెల్లగా గొంతు సవరించు కున్నాడు.

''లక్ష్మి! మా అన్నయ్య పంపించే డబ్బు ఏం చేద్దామనుకుంటున్నావు''

''అదేం పెద్ద సమస్య!'' అంది చిలిపిగాచూస్తూ

''కాదా! అసలే రోజు రోజుకీ మారిపోతున్న రూపాయి విలువతో డబ్బు విలువకూడా రోజు రోజుకీ పడిపోతుంది. అందుకే డబ్బును ఏదయినా వస్తు రూపంలో పడేస్తే క్షేమం, ఆరోగ్యదాయకం, దేవిగారు ఏం కోనాలో సెలివిస్తే మంచిది'' అన్నాడు సినిమాటిక్ డైలాగ్‌తో

''అబ్బే మీరెంత ముందుచూపుగల వారండీ'' అంది భర్త చేతిలో చేయివేస్తూ అతన్ని పొగిడేస్తూ.

''అయితే బంగారం కొంటే దాని విలువ పడిపోతుందని భయంగా ఉండదుగా'' మళ్ళీ అంది చిలిపి చూపులతో వలపు బాణాలు వేస్తూ

శ్రీరాములు గొంతులో కిలో పచ్చి వెలక్కాయలు పడ్డట్టయింది. తను భయపడ్డంతా అయిందిరా దేముడా అని అనుకున్నాడు.

''అంత డబ్బు తగలేసి బంగారామా! అసలే ఈ రోజుల్లో ధనమాన ప్రాణాలకు రక్షణ లేదు'' అన్నాడు తేరుకుని.

''కాదండీ బంగారం కొనడమే మంచిది, మన అవసరాలకు పనికొస్తుంది.

శ్రీరాములుకు బాగా తెలుసు లక్ష్మిది మొండిపట్టుదల అని, అందుకే రాజీ ధోరణిలో తన కోరికలనుకూడా సాధించుకోవాలనుకున్నాడు.

''నాకొక కోరికుంది'' అన్నాడు స్థిరంగా.

''ఏమిటది''

''నాకంటే చిన్న ఉద్యోగులు, నాకింద పనిచేసేవారుకూడా ఈ రోజుల్లో స్కూటర్‌ల మీద ఆఫీసుకొస్తుంటే నేనేమో కాళ్ళీడ్చుకుంటా వెధవ సిటీ బస్సుల్లో ఒంటికాలుపు ప్రయాణంచేస్తూ వెళ్లలేక పోతున్నాను. వారందరి ముందు నేను నా ప్రిస్టేజీ, స్టేటస్ కాపాడుకోవడానికి స్కూటర్ కొందామని అనుకుంటున్నాను'' అన్నాడు నెమ్మదిగా.

''అయితే మన ఫేమిలీ ప్రతిష్ఠకోసం మనిద్దరం కలిసి ఒక ఒప్పందానికొద్దాం'' అంది లక్ష్మి గోముగా.

''ఏమిటది''

''మరేం లేదు మీరొక పదివేలుపెట్టి స్కూటర్‌కొని మీ ప్రిస్టేజీ నిలుపుకోండి, అలాగే పదివేలతో నాక్కావలసిన నగలు, పట్టుచీరలు కొనుక్కొని నా పరువు కాపాడుకుంటాను''.

ఈ ఒప్పందం ఇద్దరికీ నచ్చింది. ఇద్దరి హృదయాలు తేలికపడ్డాయి. ఆ రాత్రి వారిద్దరు సుఖంగా నిద్రపోయారు.

కానీ ఉదయం నిద్రలేచాక ఇద్దరికీ అసంతృప్తిగానే ఉంది. ఏదో చెప్పలేని ఇది వాళ్ల మనస్సులను కుమ్మరి పురుగులా తొలచడం మొదలెట్టింది. పిల్లలు మాత్రం ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

శ్రీరాములు ఆ రోజు యధావిధిగా ఆఫీసుకెళ్లాడు. కానీ పనిమీద అసలు మనసు లగ్నం కావడంలేదు.

అసలు తానే లక్ష్మిచెప్పినట్టు ఎందుకు తలాడించవలసి వచ్చింది. ఆవిడకేం తక్కువ చేశాడు తను. అసలు తన పిత్రార్జితంలో ఆవిడకేం హక్కువుంది. తనకివ్వాల్సిన కట్నంలోనే వాళ్ల పుట్టింటి వాళ్లు కోతపెట్టారు. ఇంకా తనవాళ్ల సొమ్ము మీద ఆశపడడం ఏమిటి? ముగ్గురు పిల్లల తల్లికి ఇంకా చీరలు, నగల పచ్చేమిటి? అసలు సిగ్గుండొద్దూ! అసలు తన వెర్రిగాని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఒప్పందాలే దిక్కుమొక్కులేక గాలికి కొట్టుకుపోతుంటే పడగ్గది ఒప్పందం ఓ లెక్కా! ఏదో పాన్పుమీద గొడవ ఎందుకులే అని ఊరుకుంటే అదే నిజమైపోతుందా ఎంత మాత్రం వీల్లేదు. తనను మోసపుచ్చే ఈ ఒప్పందం ఎంతమాత్రం అమలు జరగడానికి వీల్లేదు'' అని తనకుతానే సర్దిచెప్పుకున్నాడు. ఈ నిర్ణయం అతనిలోని ఉద్రిక్తతను కొంత వరకు తగ్గించింది. చీకట్లు ముసురుకొంటుండగా నెమ్మదిగా ఇంటివైపు అడుగులెయ్యడం మొదలుపెట్టాడు.

అక్కడ లక్ష్మీదేవి ఇంటి పనులన్నీ ముగించి విశ్రాంతిగా కూర్చుంది. అసలు ఏం తిందామన్నా ఆకలి వెయ్యడం లేదు. ఎలా వ్యవహారం నడపాలా అని ఆలోచించడం మొదలెట్టింది.

రాత్రి ఎనిది గంటలవేళ శ్రీరాములు ఇల్లు చేరుకున్నాడు. భార్యభర్తలు ఇద్దరూ రాత్రి తామాడబోయే నాటకం గురించి ఆత్రంగా ఉన్నారు. చివరికి పదిగంటలవేళ పనులన్నీ పూర్తయ్యాక భార్యభర్తలిద్దరూ పడకగదిలోకి ప్రవేశించారు. ముందుగా లక్ష్మియే తేరుకుని ప్రేమంతా పీకలదాకా తెచ్చుకొని ''ఏమండీ'' అంది శృతిచేసిన వీణ రాగాలు పలికినట్లు.

''ఏంటి''

''వేకువ జామునుండి నా మనసేమీ బాగా లేదండీ''

''ఎందుకనీ''

''పీడకలొచ్చిందండీ''

''అంటే''

''అదేనండీ మీరు స్కూటరు కొన్నారు. ఎంతో బాగా నడుపుతున్నారు. మన వీధిలోని వారందరి కళ్లూ మనమీదే ఉన్నాయి. మహావేగంగా, చాకచక్యంగా, పద్మవ్యూహంలో అభిమన్యుడిలా నడుపుతున్నారు...''

''మంచిదేగా'' అనాడు లక్ష్మికి చేరువవుతూ

''ఇంతలో ఏమగులాంటి లారీ ఒకటి వేగంగా వచ్చి...''

''వచ్చీ!'' అడిగాడు అదరిపోయి ఆత్రంగా-

''గుద్దిందండీ'' అంది. ఆమె కంఠం రుద్ధమైంది. కళ్లు జలపాతాల్లా వర్షించసాగా. శ్రీరాములు ఒక్క క్షణం వణికిపోయాడు. ఇది నిజమా, లేక లక్ష్మి అల్లిన కథా! అన్న ఆలోచనలో పడ్డాడు. అతనికి సీన్ అర్థమైంది.

''లక్ష్మి బాధపడకు ఎక్కడైనా కలలో జరిగినవి నిజమవుతాయా, ఆ మాటకొస్తే నాకూ అలాంటి కలే వచ్చింది. నేను సీరియస్‌గా తీసుకున్నానా, నీకసలు చెప్పానా'' అన్నాడు తేరుకొని ఆవిడ్ని ఓదార్చుతూ.

''మీ కలేమిటి?''

''మనింట్లో దొంగలు పడాడరు. నగా నట్రాతోపాటు నిన్నుకూడా ఎత్తుకుపోయారు దొంగవెధవలు'' అన్నాడు బరువెక్కిన హృదయంతో.

''మీరు చూస్తూ ఊరుకున్నారా! మీరేం మగవారండీ'' అంది నిష్ఠూరంగా దూరంగా జరుగుతూ-

''ఊరుకుంటానా నిన్ను మాత్రం వాళ్లబారినుండి కాపాడుకున్నాను. కానీ మిగతావి పోగొట్టుకున్నాను...''

లక్ష్మి మనస్సు చివుక్కుమంది. అనుమానమేసింది. ''ఇది నిజామా? లేక తన ఎత్తుకు పైఎత్తా? ఈ రోజుల్లో దోపిడీలు సర్వసాధారణమే'' అన్న ఆలోచనలో పడిపోయింది. ఆ రోజు ఇద్దరు అన్యమనస్కంగానే గడిపారు. ఎవరి తలపుల్లో వారున్నారు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

ఉదయం నిద్రలేచిన ఇద్దరూ అపరిచిత వ్యక్తుల్లాగా మసలుకోసాగారు. లక్ష్మిపిల్లల్ని స్కూలుకి పంపించింది. శ్రీరాములు ఆఫీసుకు వెళ్దామని తయారు కాసాగాడు. ఇంతలో కుబేరుడిలాగా వాళ్ల అన్నయ్య కృష్ణమూర్తి ప్రత్యక్షమయ్యాడు.

అన్నయ్యంటే శ్రీరాములుకు తగని భయం, భక్తీ. ఆయన రాగానే ఎదురేగి ''వదినా, పిల్లలు కులాసాయేనా అన్నయ్యా'', ''రండి బావగారూ, అక్కయ్య క్షేమమేనా'' అంటూ అడిగారు దంపతులు.

''ఆహా అంతా కులాసాయేగాని మీరెలా ఉన్నారు'' ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

''బావగారూ తీరిగ్గా మాట్లాడుకుందాం గానీ మీరు ముందు స్నానం అదీ కానిచ్చి టిఫిన్ చేయండీ'' అంది లక్ష్మీదేవి.

ముగ్గురూ కలిసి టిఫిన్ చేసిన తరువాత తీరిగ్గా ''ఇదిగో ఇటుచూడు'' అంటూ రెండు పేపర్లు తీశాడు హేండ్ బ్యాగ్‌లోనుంచి.

ఏమిటో అని అని ఆత్రంగా చూస్తున్నారు లక్ష్మి, రాములు.

''ఓరేయ్ రాము ఇవి మామూలు కాగితాలు కావురా నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు''

''ఎందుకేమిట్రా నా మోహం. మీకసలే బొత్తిగా ముందు చూపులేదు. మీకు డబ్బిస్తే ఒక్కరోజులో ఖర్చు చేసెయ్యరూ. అందుకే పిల్లలపేరున సమానంగా డబ్బు జమ చేశాను. ఆరేళ్ల తర్వాత రెట్టింపు అవుతుంది. వాళ్ల చదువులకీ, పెళ్లిళ్లకీ ఉపయోగపడుతుంది. ఇవిగో తీసుకోరా కాగితాలు'' అన్నాడు కాగితాలు అందిస్తూ. భార్యభర్తలు బిక్కమొహంవేస్తూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ కాగితాలు అందుకున్నారు.